క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మానకొండూర్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో బుధవారం పూజలు నిర్వహించారు.
హుజూరాబాద్ : గణపతి నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాల్వాది సమ్మయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు పద్మానగర్‌లో వినాయకుడి వద్ద వార్డు కౌన్సిలర్ ముక్క రమేశ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 23వ వార్డు కౌన్సిలర్ మొలుగు సృజన పూర్ణచందర్, యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.
గన్నేరువరం: మండలంలోని పలు గ్రామాల్లో మండపాల్లోని గణనాథుల వద్ద బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశానరు. సందర్భంగా వినాయకుడికి వివిధ రకాల ఫలాలతో ఫలార్చన కార్యక్రమం నిర్వహించారు.

శ్రమదానంలో ముందుండాలి



టీషర్టులు పంపిణీ చేస్తున్న డీపీవో

చొప్పదండి: యువకులు శ్రమదానంలో ముందుండాలని, స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణలో భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య కోరారు. మండలంలోని కొలిమికుంటలో బుధవారం ఆయన పర్యటించారు. సర్పంచ్ తాళ్లపల్లి సుజాత యువకులకు టీషర్టులు పంపిణీ చేయగా ఆయన హాజరై అందించారు. యువకులకు క్రీడలు నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఎంపీవో రాజగోపాల్, ఎంపీటీసీ తోట కోటేశ్, ఉప సర్పంచ్ సత్తు తిరుపతి, ప్రవళిక, సురేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారు అర్హులనెప్పారు. దరఖాస్తులను అక్టోబర్ 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోలన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

వీణవంక: చేనేత సహకార సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండలంలోని కోర్కల్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అడిగొప్పుల సత్యనారాయణ అన్నారు. కోర్కల్‌లోని చేనేత సహకార సంఘం 58వ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా చేనేత జౌళీ శాఖ సహాయ అభివృద్ధి అధికారి శాంత హాజరయ్యారు. ఏప్రిల్ 2022–మార్చి 2023 వరకు జరిగిన క్రయ విక్రయాలపై సభ్యులకు చదివి వినిపించారు.కార్యక్రమంలో ఆనంద రాజమల్లయ్య, మనోహర్, సదానందం, వడ్నాల చంద్రయ్య, సింగం మల్లయ్య, రమేశ్, తదితరులున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లులో వాటా కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ

చిగురుమామిడి: కేంద్ర కేబినేట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ వాటా కల్పించాలని జెడ్పీటీసీ , రాష్ట్ర బీసీ సంక్షేమ సంగం ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ కోరారు. బుధవారం తహసీల్దార్ నరేందర్‌కు బీసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా బిల్లుతో బలహీనవర్గాలకు ఒరిగేదేమీలేదని, పరోక్షంగా అగ్రవర్ణ మహిళలకే అధికారం కట్టబెట్టే కుట్రకు తెరతీస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలే ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి తిరుపతి, గందె శిరీష, శ్రీనివాస్, నాగరాజు, తిరుపతి, రమేశ్, సత్తయ్య, ప్రతాప్‌సింగ్, సిరజ్ రాములు, తదితరులున్నారు.

కాలువలు ఇలా.. నీరు వెళ్లేదెలా.?

- ఉప కాలువలను కమ్మేస్తున్న పిచ్చిమొక్కలు
- భారీ వర్షాలు కురిస్తే కాలువలపై నుంచి పొలాల్లోకి వెళ్తున్న వరదనీరు
- అసంపూర్తి కాలువల పనులతో రైతులకు ఇబ్బందులు



గునుకుల కొండాపూర్‌లోని డి-14 కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

గన్నేరువరం: మధ్య మానేరు ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా మండలంలోని నాలుగు ఉపకాల్వల (డిస్ట్రిబ్యూటర్) నుంచి గన్నేరువరం, తిమ్మాపూర్, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. 2018 నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఆరేళ్లుగా కాలువల ద్వారా పంటపొలాలు, చెరువులు, కుంటలకు అధికారులు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఉప కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి సాగునీటికి అడ్డంకిగా మారాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ ఉపకాలువల్లోకి వరద నీటితోపాటు మిడ్ మానేరు ప్రాజెక్టు నీటితో ప్రవాహం ఎక్కువై కాలువల పైనుంచి పంట పొలాల్లోకి వెళ్తుండటంతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.

15 వేల ఎకరాలకు నీరు..

మధ్యమానేర్ ప్రాజెక్ట్ కుడికాలువ ద్వారా ఎస్సారెస్పీ స్టేజీ 2 కింద గన్నేరువరం, తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల్లోని సుమారు 15వేల ఎకరాలకు ఉప కాలువల ద్వారా నీరందిస్తున్నారు. ఈ మండలాల్లోని భూములకు సాగునీరు అందించేందుకు 9 ఉప కాలువలను భారీ నీటి పారుదలశాఖ అధికారులు గుర్తించారు. డీ6 ఉపకాలువ పారువెల్ల వరకు 600 మీటర్లు, డీ7 ఉపకాలువ పారువెల్ల నుంచి చొక్కారావుపల్లె ద్వారా గన్నేరువరం పెద్ద చెరువు (2.950 కి.మీ) డీ8 ఉపకాలువ ఖాసీంపేట నుంచి చాకలివానిపల్లె, మైలారం ద్వారా గన్నేరువరం, మాదాపూర్, సాంబయ్యపల్లె వరకు (9.22 కి.మీ) డీ9 ఉపకాలువ మాదాపూర్ నుంచి హన్మాజీపల్లె, గోపాల్‌పూర్ (7.08 కి.మీ) డీ10 చీమలకుంటపల్లె నుంచి గునుకులకొండాపూర్ (1.196 కి.మీ) డీ11 చీమలకుంటపల్లె నుంచి గునుకులకొండాపూర్ వరకు (1.140 కి.మీ) డీ12 పీచుపల్లి నుంచి జంగపల్లి వరకు 7.355 కి.మీ), డీ13 చీమలకుంటపల్లె నుంచి గునుకులకొండాపూర్ వరకు (2 కి.మీ) డీ14 చీమలకుంటపల్లె నుంచి గునుకులకొండాపూర్, గుండ్లపల్లి ద్వారా తిమ్మాపూర్ మండలం వచ్చునూర్ వరకు (8.560 కి.మీ) మేర అధికారులు నిర్మాణాన్ని గుర్తించారు. కాల్వ నిర్మాణాన్ని ఇరువైపులా వాహనాలు వెళ్లేందకు మూడు నుంచి నాలుగు మీటర్ల మేర ఖాళీ స్థలం వదిలిపెట్టారు.

చివరి ఆయకట్టుకు ఇబ్బందులు..

9 ఉపకాలువల్లో 8,9,12,14 వాటిలో మాత్రమే పనులు చేపట్టి పూర్తిచేశారు. ఈ కాల్వల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చివరి ఆయకట్టుకు నీరు వెళ్లే పరిస్థితి లేదు. వేసవిలో సాగునీరు ఎక్కువగా అవసరమున్నందున అధికారులు కాలువల్లోని పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

అసంపూర్తిగా పనులు

ఉపకాలువ 8కి సంబంధించి పారువెల్లలో వంద మీటర్లు, ఉపకాలువ 9లో హన్మాజీపల్లెలో వంద మీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. వీటితో పాటు ఉపకాల్వలు 6,7,10,11,13 కాలువల పనులు కూడా చేపట్టాల్సి ఉంది. భూముల ధరలు పెరగడంతో కాలువల పనులకు భూములు ఇచ్చేందుకు రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

మునుగుతున్న పంటలు

కాలువ నిర్మాణాలు చేపట్టిన సమయంలో వరద నీరు కాలువ కింద వెళ్లేవిధంగా అధికారులు కాలువలపై సూపర్ ప్రాసెజ్ (ఎస్‌పీ) నిర్మాణాలను చేపట్టారు. కానీ భూమి ఉన్న ఎత్తుకన్నా పైకి నిర్మాణాలు చేపట్టడంతో వరదనీరు వెళ్లడం కష్టతరంగా మారుతుందని, దీంతో పంటపొలాలు మునిగి తీవ్రనష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువ పనులు పూర్తిచేయాలి



డి14 కాల్వపనులు అసంపూర్తిగా వదిలేశారు. వరదనీరు కాలువ చివర ఉన్న రైతుల పొలాల్లోకి భారీగా వరద నీరు చేరి నష్టం జరుగుతోంది. నీటిని గ్రామంలోని చెరువుతో పాటు ఎల్ఎండీ ప్రాజెక్టు సమీపం వరకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– సుధాకర్‌రెడ్డి, వచ్చునూర్

ఉప కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తాం

మధ్యమానేరు ప్రాజెక్టు కింద ఉపకాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులను త్వరలో చేపడుతాం. అసంపూర్తి కాలువల పనులను పూర్తిచేయిస్తాం. కాలువలపై చేపట్టిన సూపర్‌ప్రాసెజ్‌లపై వరదనీరు వెళ్లడం లేదని రైతుల ఫిర్యాదు మేరకు పునర్నిర్మాణం చేపడుతాం. డి14 కాలువ పనులు పూర్తయ్యాయి.

– మహేందర్, ఇరిగేషన్ ఏఈ

నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: గణేశ్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధలోని వినాయక మండలాలలోని గణనాథులను దర్శించుకొని మొక్కుల చెల్లించుకున్నారు. మున్సిపల్ పరిధిలోని 70 వినాయక మండపాల నిర్వహకులకు రూ.5వేల చొప్పున అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్ బొంగోని వీరన్న, నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి గ్రామపంచాయతీ వరకు రూ. 43.24 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్, బండ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేతపై ఆగ్రహం

గన్నేరువరం: మండలంలోని యాస్వాడలో మంగళవారం ఇంకుడుగుంతలో పడి సాజన్ అనే మూడేళ్ల బాలుడు మృతిచెందగా గ్రామంలో వివిధ ప్రదేశాలతో పాటు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం గుంతలు తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంపై బాలుడి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ రఘునాథ్‌రెడ్డి జేసీబీతో గుంతలు పూడ్చివేస్తుండగా బాలుడి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రమాదం జరగకముందు ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించే వరకు పూడ్చివేత నిలిపివేయాలన్నారు. దీంతో పనులను వారు నిలిపివేశారు. ఇంకుడు గుంతను పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఆహార భద్రత కమిటీ సభ్యుడు ఓరగంటి ఆనంద్, మాజీ జెడ్పీటీసీ జువ్వాడి మన్మోహన్‌రావు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. నేడు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించనున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న సాంబారి కొమురయ్య



రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిగురుమామిడి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, రైతు సమన్వయసమితి జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య కోరారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్రంలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సకాలంలో ఆమోదం తెలుపకపోవడంతో 75 ఏళ్లుగా ఒకే వర్గానికి చెందిన వారు రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆలిండియా అంబేద్కర్ సంఘం సమావేశంలో నాయకులు బెజ్జంకి అంజయ్య, గడ్డం నాగరాజు, కిష్టయ్య, గడ్డం అనిల్‌కుమార్, మైలారపు చంద్రయ్య, జిల్లేల్ల నాంపల్లి, దర్శనం నల్లగొండ స్వామి, సారయ్య, తదితరులున్నారు.
హుజూరాబాద్: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజుకు చేరాయి. ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ రుద్రారపు రామచంద్రం మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం వందరోజుల్లో వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించకపోతే బీజేపీని మాదిగలు అడ్డుకుంటారన్నారు. ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్ శ్రీనివాస్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వసంత్, ఎంఐఫ్ నాయకులు రత్నం, శేఖర్, సమ్మయ్య, బీసీ నాయకులు జనార్దన్, బీఎస్పీ నాయకులు రమేశ్, భాస్కర్, ప్రభాకర్, అడ్వకేట్ కొత్తూరి రమేశ్, మల్లేశ్, జీవన్ కుమార్, పట్టణ నాయకులు రాజకుమార్, భారత్ బచావో నాయకులు సదానందం, స్వామి, కొమరయ్య, మహేశ్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.
జమ్మికుంట: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు రేణికుంట్ల సాగర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన రిలే దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు అజయ్, దొడ్డె రమేశ్, పుల్లూరి కుమార్, కలకోట అరుజన్, చింతల నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

శంకరపట్నం: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు, భోజన నిర్వాహకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పిట్టల సమ్మయ్య మాట్లాడారు. భోజన నిర్వాహకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువులు, గ్యాస్, కూరగాయలు ప్రభుత్వమే సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, సహనాబేగం, సరోజన, రాధవ్వ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.
గన్నేరువరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఆర్ఐ రజినీస్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, కనుకయ్య, మల్లయ్య, సాగర్‌రెడ్డి, కనకలక్ష్మి, సత్తవ్వ, కవిత, విజయలక్ష్మి, దుర్గవ్వ, రాజవ్వ, బాలమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

చిగురుమామిడి: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినేట్ ఆమోదం తెలపడం హర్షనీయమని, ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

✦ వినతిపత్రం అందజేత

సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ అనుమతి కోసం సర్పంచ్, కార్యదర్శికి బుధవారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, తదితరులు వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

✦ ఇంటింటా మట్టి సేకరణ

చొప్పదండి: పట్టణంలోని ఎనిమిదో వార్డులో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మేరా మిట్టి– మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. నవతరం యూత్ క్లబ్ సభ్యులు ఇంటింటా తిరిగి మట్టి సేకరించారు. వార్డు కౌన్సిలర్ రాజన్నల ప్రణీత మాట్లాడారు. తాడూరి రామకృష్ణ, యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

✦ వెదురు ఉత్పత్తులతో కాలుష్య నివారణ

వీణవంక: వెదరు ఉత్పత్తులను ఉపయోగించడంతో కాలుష్యాన్ని నివారించవచ్చని సర్పంచ్ కుమార్, వైస్ ఎంపీపీ లత అన్నారు. ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో మేదరి కులస్తుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. మేదరి సంఘం మండల అధ్యక్షుడు కుమారస్వామి, గణేశ్‌కుమార్, వెంకటేశ్, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో దేశిని విజయ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కూతురు దేశిని శ్రీనిధి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు, తోటి ఉపాధ్యాయులు రూ.10,500 లను బాధిత కుటుంబానికి ఆర్థికసాయంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడి వెంట ఉపాధ్యాయులు రాజమౌళి, జ్యోత్స్న, శంకర్, గోవర్ధన్, తదితరులున్నారు.

కుల వృత్తులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



మొక్క నాటుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్ : కులవృత్తులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జూపాక గ్రామంలోని తాటివనంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీడ్ తాటి చెట్ల నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీడ్ తాటి చెట్ల కార్యక్రమానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం కోసం సొంత నిధులతో విత్తనాలు నాటుతున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ మండలంలో 2వేలు మొక్కలు నాటే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ మాజీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీని వాస్, మాజీ ఎమ్మెల్యే కొండూరు సత్యనారాయణ గౌడ్, ఎక్సైజ్ సీఐ దుర్గా భవానీ, మాజీ ఎంపీటీసీ కేతిరెడ్డి రాజిరెడ్డి, అంకుష్, వెంకటేశ్, శ్రీనివాస్ పంజాల సురేందర్ గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- కరీంపేటలో విగ్రహావిష్కరణ



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కరీంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మెట్టప్రాంతమైన కరీంపేట గ్రామానికి కాలువనీటిని తీసుకువచ్చేందుకు నిధులు మంజూరు చేస్తే కొందరు కాలువ పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు విదేశీ విద్య అందిస్తున్నామని, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు వనపర్తి మల్లయ్య, సంజీవరెడ్డి, భద్రయ్య, ఎంపీటీసీ తిరుపతయ్య, విండో చైర్మన్లు సంజీవ రెడ్డి, మధుకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, అంబేడ్కర్ సంఘం నాయకులు మల్లేశం, శ్రీనివాస్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని ముత్తారం కరీంపేట గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన యువకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, తిరుపతయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

ఇల్లందకుంట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి శ్రీనివాస్‌తో పాటు సిరిసేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రణీతదేవి, ఎస్ఎంసి చైర్మన్ దుర్గయ్య పోటీలను ప్రారంభించారు. ఇల్లందకుంట, సిరిసేడు, కేజీబీవీ, టేకుర్తి మోడల్ స్కూల్, బూజునూరు పాఠశాలలకు చెందిన దాదాపు 360 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఇల్లందకుంట క్రీడాసమాఖ్య కన్వీనర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. అండర్–14 బాలురకు ప్రథమ బహుమతి సిరిసేడు, ద్వితీయ బహుమతి అండర్–17 ఇల్లందకుంట, బాలికలకు ప్రథమ ఇల్లందకుంట, అండర్ –17 బాలికల్లో మొదటి బహుమతి సిరిసేడు, ద్వితీయ బహుమతి ఇల్లందకుంట పాఠశాల గెలుపొందినట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, సంపత్, రమేశ్, పర్శరాములు, రాజశేఖర్, స్నేహలత పాల్గొన్నారు.
జమ్మికుంట: పట్టణంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎంఈవో విడుపు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మండలంలోని జెడ్పీహెచ్ఎస్ వావిలాల, కొత్తపల్లి, మడిపల్లి, కోరపల్లి, జమ్మికుంట, జమ్మికుంట సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన 360 మంది బాలుర క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రేమలత, బాపూరపు శేఖర్, సత్యనారాయణ, శ్రీను, కేజీబీవీ ఉమ, సుమన్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.
హుజూరాబాద్‌రూరల్ : పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం పోటీల్లో భాగంగా అండర్–14,17 కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు పీడీ సారయ్య తెలిపారు.
చొప్పదండి: పట్టణంలోని క్రీడామైదానంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి క్రీడలను ప్రారంభించారు. ఎడీ కె.కృష్ణ, ఎం.చంద్రశేఖర్, వి.సూర్య ప్రకాశ్, డి.సత్యానంద్, రజని, స్వప్న, పీఈటీలు పాల్గొన్నారు.
గంగాధర: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. విద్యాధికారి వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు



గంగాధర : ఇంటింటి ప్రచారంలో మేడిపల్లి సత్యం

గంగాధర: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆల్ గ్యారెంటీ పథకాలు అమలు చేస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కొండన్నపల్లి (న్యాలకొండన్నపల్లి)లో నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుపార్టీల నుంచి సుమారు వందమంది కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్, రాజేశం, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్య ప్రసన్న, చర్ల పద్మ, శకుంతల, తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చయ్య, సంధ్య కరుణాకర్, చక్రపాణి, సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, మహేశ్, కరీం, సంతోష్, సంపత్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

కొండపల్కలలో ..

మానకొండూర్: కొండపల్కలలో గడప గడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామంలోని గణనాథుల వద్ద పూజలు నిర్వహించారు. మాజీసర్పంచ్ రాజయ్య, నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

జమ్మికుంట: ఎస్‌వీ పాఠశాలకు చెందిన దూడపాక శ్రీవర్షిణి ప్రభుత్వం నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో శ్రీ వర్షిణి సీటు సాధించిగా పట్టణ సీఐ రమేశ్ అభినందించారు. నంది అవార్డు గ్రహీత ప్రభు, స్కూల్ యాజమాన్యం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

హుజూరాబాద్ : పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించగా పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు హఫీజ్ ఖురేషి, కైరుని సాబేగం, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.